క్లుప్తంగా

తొలివిడతగా 12వేల డస్ట్‌బిన్లు



ఎంపీడీవో కార్యాలయానికి లారీలో వచ్చిన డస్ట్‌బిన్లు

రాజవొమ్మంగి: స్థానిక మండలప్రజాపరిషత్ కార్యాలయానికి సోమవారం తొలివిడతగా 12వేలకు పైగా డస్ట్ బిన్లు (ప్లాస్టిక్ చెత్త బుట్టలు) చేరాయి. పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగంగా వీటిని ఇంటికి రెండు చొప్పున పంపిణీ చేయనున్నారు. కాగా ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత మాత్రమే వీటిని పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు.

28 మందికి వైద్య సేవలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ నాగార్జున

రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి పీహెచ్‌సీ పరిధిలోని చీడిపాలెంలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో 38 మందికి వైద్య సేవలందించినట్టు డాక్టర్ నాగార్జున తెలిపారు. శిబిరానికి వచ్చిన వారిలో బీపీ ఉన్న 10 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్టు చెప్పారు. శిబిరంలో నలుగురు గర్భిణులు, ఇద్దరు బాలింతలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన ఆరోగ్య సూచనలు ఇచ్చామన్నారు. 104 సిబ్బంది, ఆశ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మంచం పైనుంచి పడి వ్యక్తి మృతి



శ్రీనుబాబు(ఫైల్)

చింతపల్లిరూరల్: మంచంపై నిద్రిస్తూ నిద్ర మత్తులో కింద పడి తలకు తీవ్రగాయమై, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో బౌడ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే బౌడ గ్రామానికి చెందిన వరకోటి శ్రీనుబాబు గురువారం అర్ధరాత్రి నిద్రమత్తులో మంచంపై నుంచి కింద పడి తలకు తీవ్రగాయమైంది. ఈ మేరకు కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించి, మెదడులో రక్తం గడ్డ కట్టడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం శ్రీనుబాబు మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

బాధితుడికి పరామర్శ



ఎలుగుబంటి దాడిలో గాయపడిన రామ్‌దాసును పరామర్శిస్తున్న బాలదేవ్, మగ్గన్న

అరకులోయటౌన్: ఎలుగుబంటి దాడిలో గాయపడిన గిరిజనుడికి మెరుగైన వైద్యం అందించాలని గిరిజన సంఘం నాయకులు వైద్యులకు సూచించారు. మండలంలోని లోతేరు పంచాయతీ శిరసుగుడ గ్రామానికి చెందిన గిరిజనుడు ఎలుగుబంటి దాడికి గురై అరకులోయ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జనం రాందాస్‌కు గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడారు. కొండమీద మేకలు కాస్తున్న రాందాస్‌కు వెనుక నుండి రెండు ఎగులుబంట్లు దాడి చేయగా తీవ్ర గాయాలు పాలై ఆస్పత్రిలో చేరారన్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ప్రభుత్వం తరఫున పరిహారం అందించాలన్నారు. బాధితుడికి పరామర్శించిన వారిలో మగ్గన్న ఉన్నారు.

గోవాలమ్మతల్లి పండగ నేడు

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో మంగళవారం గోమాలమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి అయిదేళ్లకు ఒకసారి నిర్వహించే పండగను ఈ సారి కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు సంఘ అధ్యక్షుడు బొడ్డేడ అప్పలనాయుడు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.



పెద్దలంక గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు



జి.మాడుగుల(సాడేక్)-2 గ్రామ సచివాలయం భవనం

సాడేక్‌లో ప్రగతి పరుగులు

- గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- మారుమూల గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాల కల్పన
- ఆనందంలో గిరిజనం

జి.మాడుగుల: నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో తాగునీటి, సీసీ రోడ్లు లేక గిరిజనులు తీవ్ర అవస్థలు పడేవారు. చంద్రబాబు ప్రభుత్వం ద్వారా ప్రజలకు సకాలంలో సక్రమంగా సేవలందక తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రతీ పనికి జన్మభూమి కమిటీలతో అనేక ఇబ్బందులు పడేవారు. జి.మాడుగుల-2(సాడేక్) సచివాలయంలో పరిధిలో గల 15 గ్రామాలున్నాయి. గత పాలకుల నిర్లక్ష్యం వలన ఆయా గ్రామాల్లో సమస్యలు ఎక్కడికక్కడే విలయతాండవం చేస్తుండేవి. దీంతో ప్రజల సతమతమవుతుండేవారు. చంద్రబాబు హయాంలో గిరిజన గ్రామాలు కనీస అభివృద్ధికి నోచుకోలేదు. టీడీపీ ప్రభుత్వం గిరిజనుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించింది. పంచాయతీల్లోని గ్రామాల్లో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు, తాగునీటికి, డ్రైనేజి వ్యవస్థ లేక గిరిజన ప్రజలు ఇబ్బందులు పడేవారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, కుళాయిలు ఏర్పాటు, ప్రజావసరాలకు తాగునీటి బోర్లు నిర్మాణాలు చేపట్టారు. రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి సకాలంలో రైతులకు విత్తనాలు ఎరువులు, ఇతర సేవలు అందిస్తున్నారు. గ్రామ సచివాలయం-2పరిధిలో 15గ్రామాల్లో 2000మంది జనాభాకు అభివృద్ధి పనులు అందుబాటులోనికి వచ్చాయి.

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటం, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధి పరుగులు తీసింది. గ్రామ సచివాలయం ఏర్పాటు చేసి గ్రామ వలంటీర్ వ్యవస్థతో గిరిజన గ్రామాల్లో ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తెచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోని రాగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందింది. ప్రజా సమస్యలు పరిష్కారమయ్యాయి. పంచాయతీ కేంద్రంలో సచివాలయం ద్వారా అందరికీ ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. డీబీటీ ద్వారా 928 మందికి లబ్ధిదారులకు రూ.4,69,459.45కోట్లు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది.

చేపట్టిన అభివృద్ధి పనులు

- రూ.49లక్షలతో గ్రామ సచివాలయాన్ని నిర్మించారు.
- రూ.30లక్షలతో గూపిగెడ్డ. పెదలంక, చిన ఉరుము, కరకపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు
- సాడేకు నుంచి బొంజంగి రోడ్డు నిర్మాణానికి రూ.60లక్షలు వెచ్చించారు.
- ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి తడగొంది రోడ్డు వరకు రూ.40లక్షలు ఖర్చు చేశారు.
- సుమారు రూ.20లక్షలపైగ నిధులతో కరకపల్లి, చినఉరుము, గూపిగెడ్డ, పెదలంక, కొత్తపల్లి, పెద ఉరుము, సాడేక్ గ్రామాల్లో బోర్లు, గ్రావిటీ పథకాలను నిర్మించారు.



గూపిగెడ్డ గ్రామంలో ఏర్పాటు చేసిన కుళాయి

సమస్యలు తీరాయి



గత టీడీపీ ప్రభుత్వం హయాంలో కనీస అభివృద్ధి పనులు జరగలేదు. గ్రామాల మధ్య రోడ్లు, వీధుల్లో సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలు వంటి సమస్యలు ఎదుర్కోన్నాం. రోడ్లు లేక పోవడం వలన వర్షాకాలంలో బురదమయంగా ఉండటం వలన నడవటానికి ఇబ్బందులు పడేవారం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాల మధ్య రోడ్లు, వీధుల్లో సీసీ రోడ్లు వేయించారు. బోర్లు, గ్రావిటీ నీటి పథకాలు ఏర్పాటుతో గ్రామస్తుల సమస్యలు పరిష్కారమయ్యాయి. మౌలిక సదుపాయాల కల్పనతో సమస్యలు తీరాయి.

– గబ్బాడి నాగమణి, వైస్ సర్పంచ్, సాడేక్ గ్రామం

అభివృద్ధి పథంలో పయనం



సచివాలయం పరిధిలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి పనులు చేపట్టాం. అన్ని గ్రామాల్లో తాగునీటి కల్పనకు గ్రావిటీ, బోర్లు ఏర్పాటు, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాం. నవరత్నాల పథకాలు అర్హులందరికీ అమలు చేశాం. అవినీతి రహిత, మధ్యవర్తిత్వం లేని పాలన కొనసాగిస్తున్నాం.ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నాం. గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి.

– కిముడు రాంబాబు, సర్పంచ్, జి.మాడుగుల

నేటి నుంచి గంగాలమ్మ తల్లి ఉత్సవాలు



గంగాలమ్మ తల్లి

మారేడుమిల్లి: మారేడుమిల్లి గ్రామ దేవత మాతృశ్రీ కనకవర్షిణీ గంగాలమ్మ తల్లి జాతర ఉత్సవాలు మంగళవారం ప్రారంభమవుతాయి. మిరుమిట్లు కొలిపే విద్యుత్ కాంతులతో అంగరంగా వైభవంగా జాతర ఉత్సవాలు నిర్వహించడానికి ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అయిదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా తొలి రోజు మంగళవారం గ్రామస్తులు కర్రీ లక్ష్మీ శ్రీనివాసురెడ్డి, శ్రీమతి సింధు, బోడ్డేటీ వీరబాబు, శ్రీమతి లక్ష్మి దంపతులచే అమ్మవారికి కుంకుమ పూజా కార్యక్రమం, అనంతరం బోణాల ఊరేగింపు, గిరిజన పూజారులచే అమ్మవారికి పూజా కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. సాయంత్రం గరగలాట, థింసా నృత్యాలు, తిన్మార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు . అయిదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతి రోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఈ ఉత్సవాలకు మారేడుమిల్లితో పాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తారని చెప్పారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం



గంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు, చిత్రంలో గ్రంథాలయ అధికారి సత్యవతి

పాడేరురూరల్(హుకుంపేట): స్థానిక గ్రంథాలయంలో బాల బాలికలకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేపట్టారు.గ్రంథాలయ అధికారి ఎం.సత్యవతి ఇక్కడ బాలబాలికలకు ఇంగ్లిషు పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠ్యాంశాలను బోధించారు.పలు దినపత్రికలను పరిచయం చేసి వాటిని కూడా చదివించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి సత్యవతి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి విజ్ఞాన శిబిరాలకు పంపాలన్నారు. జూన్ 7వతేదీ వరకు ఈ శిబిరం ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాడు-నేడు పనులను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవోలు సత్యనారాయణ, రామన్న

గూడెంకొత్తవీధి: పాఠశాలల పునఃప్రారంభం నాటికి మండలంలో నాడు-నేడు కింద చేపట్టిన రెండో విడత పాఠశాల పనులు పూర్తి చేయాలని జీకే వీధి ఎంఈఓలు సత్యనారాయణ, రామన్నలు సూచించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులతో సోమవారం సమావేశం నిర్వహించారు. నాడు-నేడు పనుల్లో భాగంగా మండలంలోని 63 పాఠశాలలకు రూ.4.14 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆయా నిధులతో పనులను పూర్తిచేయాలని కోరారు. సీఆర్‌పీలు సత్యనారాయణ దేవేంద్ర దారబాబు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం వేలానికి దరఖాస్తులు

చింతూరు: చింతూరు జీసీ గోదాములో జప్తు చేయడం ద్వారా 10,770 టన్నుల బియ్యం నిల్వ ఉందని వాటిని బహిరంగ వేలం చేయనున్నట్టు తహసీల్దార్ నజీముల్లాషా సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన లైసెన్స్‌డ్ ట్రేడర్లు 27 తేదీ సాయంత్రం 5.00 గంటలలో గా తహసీల్దార్ కార్యాలయంలో వేలానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రైవేట్ బస్సులతో ప్రయాణికులకు అగచాట్లు



మొరాయించిన బస్సును నెడుతున్న ప్రయాణికులు

అరకులోయ రూరల్: ఏజెన్సీలో పర్యటిస్తున్న ప్రైవేట్ బస్సులు తరచూ మొరాయిస్తుండడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. కండీషన్ లేని బస్సులను నడుపుతుండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. పరిమితికి మించిన ప్రయాణికులు, లోడు, అధిక వేగంతో రాకపోకలు సాగిస్తున్న ప్రైవేట్ బస్సుల్లో ప్రయాణానికి గిరిజనులు భయపడుతున్నారు. పలుమార్లు అధికారులు హెచ్చరిస్తున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయింది. మండల కేంద్రంలో అరకులోయ నుంచి ఒనకడిల్లీ వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. దీంతో కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. బస్సు మొరాయించి నిలిచిపోవడంతో మండుటెండలో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. గత్యంతరం లేక ప్రయాణికులంతా కలిసి బస్సును రోడ్డు పక్కకు నెట్టడంతో రాకపోకలు యధావిధిగా సాగాయి. దీనిపై అధికారులు మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బోసిపోయిన ఎగ్జిబిషన్



అనుమతి లేక నిలిపివేసిన జెయింట్ వీల్



బోసిపోయిన దుకాణాలు

అరకులోయటౌన్: మండల కేంద్రంలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందను కేవలం కళ్యాణ వేడుకకు మాత్రమే పరిమితమిచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా ఏటా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేస్తారు. ఇందులో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు మూడు రోజుల పాటు నిర్వహించం ఆనవాయితీ. ఈ సందర్భంగా మైదాన ప్రాంతాల నుంచి వివిధ రకాల వస్తువుల తీసుకువచ్చి విక్రయిస్తారు. జైంట్‌వీల్‌తో పాటు అనేక ప్రదర్శనలు ప్రదర్శిస్తారు. పండుగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించేందుకు వచ్చి వారు ఎగ్జిబిషన్‌లో వస్తువులు కొనగోలు చేస్తుంటారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సవ కమిటీ ప్రతినిధులు వాయిదా వేశారు. ఫలితంగా ఇక్కడ ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ బోసిపోయింది. జూన్ 15 నుంచి మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కొంతమేర నష్టపోయినట్టు పలువురు వ్యాపారులు చెబుతున్నారు.

పాఠశాలల్లో సమస్యలను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో కృష్ణమూర్తి

ముంచంగిపుట్టు: పాఠశాలలు పునఃప్రారంభం నాటికి సౌకర్యాలను గుర్తించి ఉపాధ్యాయులంతా సంసిద్ధం కావాలని ఎంఈవో కె.కృష్ణమూర్తి అన్నారు.మండల కేంద్రంలో సోమవారం ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు.పాఠశాలలో మరుగుదొడ్లు, కిచెన్ షెడ్‌లు, తాగునీరు వంటి సౌకర్యాల పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. గతంలో నాడు-నేడు ద్వారా 58 పాఠశాలల్లో జరిగిన పనుల ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎంఈవో కృష్ణమూర్తి మాట్లాడుతూ పాఠశాలలు జూన్‌లో తెరిచే నాటికి ముందస్తుగానే సమస్యలు గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలని, నాడు-నేడు పనులు జరిగిన పాఠశాలలు ఉపాధ్యాయులు అన్ని రికార్డులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఉన్నతాధికారులు పనులపై ప్రశ్నిస్తే జవాబుదారీతనంగా ఉండాలన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ జబ్బర్, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



జీకే వీధిలో పార్టీల నేతలతో మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ అప్పలసూరి



చింతపల్లిలో ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజారావు



కూనవరంలో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించిన ఎస్ఐ శ్రీనివాసరావు

గూడెంకొత్తవీధి: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వివిధ రాజకీయ పార్టీలనాయకులు అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి అల్లర్లు, హింసాత్మక ఘటనలకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని గూడెంకొత్తవీధి సీఐ అప్పలనాయుడు, ఎసఐ అప్పలసూరి అన్నారు. సోమవారం చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. శాంతి భద్రతలకు భంగం కల్గించకుండా చట్టాన్ని గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎక్కువమంది గుమిగూడి ఉండటం మందుగుండు, బాణాసంచా వంటివి కాల్చడం ర్యాలీలు, ధర్నాలు వంటివాటికి అనుమతి లేదన్నారు.

పెదబయలు: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు గ్రామాల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లుకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ సూచించారు. సోమవారం పెదబయలు మండలంలోని గోమంగి పంచాయతీ కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరూ ఎలాంటి గొడవలకు పాల్పడవద్దన్నారు. ప్రజలు సహకారంతో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం జరిగిందని, ఓట్ల లెక్కింపు వరకు కూడా ప్రజలు సహకారం అందించాలని కోరారు. గ్రామాల్లో చదువుకున్న యువత గొడవలు, అల్లర్లు జరగకుండా గ్రామాల్లో అవగాహన పెంచాలని కోరారు.

అనంతగిరి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని, ఎస్ఐ కె.రాము అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ ప్రజాప్రతినిధులకు, యువతకు అవగాహన కల్పించారు. 144 సెక్షన్ అమలులో ఉన్ననేపథ్యంలోని గొడవలు, అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు.

చింతపల్లిరూరల్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని అన్నవరం ఎస్ఐ రాజారావు చెప్పారు. లోతుగెడ్డలో ఆయన సోమవారం ప్రజాప్రతినిధులు, యువతతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు తలెత్తకుండా అందరూ సహకరించాలన్నారు. ఎన్నికల ఫలితాల వరకు అందరు సమన్వయం పాటించాలని సూచించారు. జూన్ 4తేది వరకు ముందస్తు సమాచారం లేకుండా రాజకీయ సమావేశాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.


కూనవరం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎస్ఐ కె శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ రోజు బాణా సంచాకాల్చవద్దని, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడానికి ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ రోజు ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రజలు సహకరించాలని కోరారు. బంకుల్లో లూజ్ పెట్రోల్ అమ్మిన, బాణాసంచా కలిగి ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



గోమంగిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

గంగవరం: గ్రామాల్లో బాటిల్ లో పెట్రోల్ అమ్మకాలు నిషేధిస్తున్నట్టు గంగవరం ఎస్ఐ రామ కృష్ణ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. పెట్రోల్ బాటిల్లో పోసి అమ్మకాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) ఆదేశాల మేరకు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు బాటిల్‌లో పెట్రోల్ అమ్మకాలు చేయవద్దని వ్యాపారులను సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

పచ్చదనమే... ప్రకృతివనమే



అరకులోయ రూరల్: అరకులోయ పరిసరాల ప్రకృతి అందాలు చూపరులను కనువిందు చేస్తున్నాయి.. పచ్చని చీరకట్టినట్టుగా పచ్చిక బయళ్లు కనువిందు చేస్తున్నాయి. ఎర్రటి తురాయి పువ్వుల అందాలు ప్రకృతి రమణీయతను రెట్టింపు చేస్తున్నాయి. మన్యం అందాలు మాటలకందని భావాలుగా దర్శనమిస్తున్నాయి.. అరకులోయలో ఆహ్లాదకరమైన వాతావరణం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తోంది..



నేడు గజ్జాలమ్మ ఉత్సవం

కశింకోట: మండలంలోని కస్నూరుపాలెం గ్రామంలో గజ్జాలమ్మ ఉత్సవం మంగళవారం నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. రెండేళ్లకొకమారు ఇక్కడ అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఆలయాన్ని అందంగా అలంకరించారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయని, సాయంత్రం జాతర ఊరేగింపు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

నర్సీపట్నం: రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్బీకే)రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి అప్పారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 ఆర్బీకేల్లో విత్తనాలు పంపిణీకి సిద్ధం చేశామన్నారు. కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుని, రాయితీ మినహాయించి, మిగిలిన మొత్తాన్ని చెల్లించి విత్తనాలు పొందాల్సిందిగా సూచించారు. జనుం 10 కిలోల ధర రూ.880 కాగా సబ్సిడీపోను రూ.440కే అందిస్తున్నామన్నారు. రూ.880 విలువైన 10 కిలోల జీలుగ విత్తనాలు రూ.440, రూ.1,072 ఖరీదు చేసే 8 కిలోల పిల్లిపెసర విత్తనాలు రూ.536కు కొనుగోలు చేయవచ్చన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.